సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 7 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.26 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.15 వేల ప్రకారం ధర పలికాయి.



రెండు గ్రామాలు..ఓ దేవర దున్న
ఓ దేవర దున్నపోతు పంచాయితీ రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల జోక్యంతో సోమవారం ఈ వివాదానికి తెర పడింది. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.1°/09.6°
జిల్లా వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉదయం వేళ పొంగమంచు తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. కూటమి సర్కార్ చేతగాని తనం వల్ల రోజుకోచోట మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. సోమవారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడారు. ఆదివారం పరిగి మండలంలో అభం, శుభం తెలియని ఏడేళ్ల బాలికను సునీల్ కుమార్ అనే వ్యక్తి లొంగదీసుకొనే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నియోజకవర్గంలోనే ప్రజలకు భద్రత కరువైందన్నారు. మంత్రి సవితకు మహిళల భద్రతపై బాధ్యత లేదా.. అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే 'దిశ 'యాప్, దిశ పోలీస్ స్టేషన్లు కనుమరుగయ్యాయన్నారు. ఫలితంగా మహిళలకే కాదు ముక్కుపచ్చలారని పసిపిల్లలకు కూడా భద్రత కరువైందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీచర్ విజయ భార్గవికి రాష్ట్రస్థాయి బహుమతి



విజయ భార్గవికి బహుమతి ప్రదానం చేస్తున్న తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి

పుట్టపర్తి/మడకశిర రూరల్: సావిత్రి బాయి పూలే 194వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 3న నిర్వహించిన టీచర్స్ ఫెస్ట్ పోటీల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయురాలు విజయ భార్గవి సత్తా చాటారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన టీచర్లకు నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో మడకశిర మండలం రేకులకుంట ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయురాలు విజయ భార్గవి ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్‌కు మొదటి బహుమతి దక్కింది. దీంతో ఆమెకు తెలంగాణ హైకోర్టు జడ్జి రాధారాణి ప్రశంసా పత్రంతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందించారు. ప్రతిభ కనబరచి జిల్లా ఖ్యాతిని చాటిన విజయ భార్గవిని డీఈఓ కృష్ణప్ప, జిల్లా సెన్సు అధికారి తనూజ్ కుమార్‌తో పాటు పాఠశాల హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

జనసేన కార్యకర్తపై బీజేపీ నాయకుల దాడి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు బాలకృష్ణ

ధర్మవరం: దళిత సామాజిక వర్గానికి చెందిన జనసేన కార్యకర్తపై బీజేపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితుడు బాలకృష్ణ సోమవారం రాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ నాగేంద్ర ప్రసాద్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీని దళిత సామాజిక వర్గానికి చెందిన జనసేన కార్యకర్త బాలకృష్ణకు ప్రభుత్వం కేటాయించింది. అయితే బీజేపీ నాయకుడు డోలా రాజారెడ్డి, అతని అనుచరులు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహించకుండా బాలకృష్ణను అడ్డుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి సితార్ గ్రాండ్ వద్ద బాలకృష్ణ టీ తాగుతుండగా, బీజేపీ నాయకుడు డోలా రాజారెడ్డి బావమరిది ప్రతాప్‌రెడ్డి, మరో నలుగురు అనుచరులు వచ్చి 'రాజారెడ్డి చెప్పినా... వినవా' అంటూ కులం పేరుతో దూషించడంతో పాటు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో బాలకృష్ణ ప్రాణభయంతో డీఎస్పీ ఆఫీస్‌లోకి వెళ్లడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనలో గాయపడిన బాలకృష్ణ ప్రాథమిక చికిత్స అనంతరం సోమవారం సాయంత్రం పట్టణ సీఐ నాగేంద్ర ప్రసాద్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు డోలా రాజారెడ్డి, గొళ్లాళ్లపల్లి వెంకి, రాజారెడ్డి అనుచరులతో తనకు ప్రాణహాని ఉందని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేయాలని కోరారు.



2024 డిసెంబర్ 21వ తేదీ తెల్లవారుజామున మడకశిర మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామ సమీపంలో 544ఈ- జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ పొగమంచు వల్ల ఎదురుగా రోడ్డుపై ఆగి ఉన్న లారీ కనిపించకపోవడంతో వెనుక నుంచి ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.



సోమవారం ఉదయం 9 గంటల సమయంలో కదిరి సమీపంలో కనిపించిన దృశ్యమిది. భానుడిని సైతం కమ్మేసిన దట్టమైన పొగమంచుతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వస్తున్న వాహనం సైతం కనిపించనంతగా రహదారిని పొగమంచు కప్పేయడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు.

ప్రయాణానికి పొగమంచు



సోమవారం తెల్లవారుజామున పుట్టపర్తి సమీపంలో జాతీయ రహదారిపై ఇలా...

- ఇబ్బందులు పడుతోన్న వాహనదారులు
- గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి
- జాతీయ రహదారులపై కష్టంగా మారిన ప్రయాణం
- వాహనాన్ని రోడ్డుపై నిలిపినా ప్రమాదమే!
- ఉదయం 9 గంటల వరకు రాకపోకలకు తప్పని తిప్పలు

సాక్షి, పుట్టపర్తి

వాతావరణంలో మార్పులతో నాలుగైదు రోజులుగా దట్టమైన పొగమంచు జిల్లాను కమ్మేస్తోంది. ఉదయం 9 గంటల వరకూ భానుడినీ బంధించేస్తోంది. ఫలితంగా ఎదురుగా ఏముందో కూడా తెలియని పరిస్థితి తలెత్తుతోంది. ఈ క్రమంలోనే జాతీయ రహదారిపై ప్రయాణించే డ్రైవర్లు రోడ్డు సరిగా కనిపించక ఆగి ఉన్న వాహనాలు, రోడ్డు పక్కనే ఉన్న చెట్లను ఢీకొడుతున్నారు. పొగమంచు వల్ల ప్రయాణం ప్రమాదం అని తెలిసినా... కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఉదయమే ప్రయాణించాల్సిన పరిస్థితి.

జాతీయ రహదారిపైనే ప్రమాదాలు..

జాతీయ రహదారులపై మంచు ప్రభావం అంచనా వేయలేం. ఏ ప్రాంతంలో ఎంత ప్రభావం ఉందనేది ఎవరూ అంచనా వేయలేరు. ఉన్నఫలంగా ముందున్న అద్దాన్ని పొగమంచు కమ్మేయడంతో రోడ్డు కానరాదు. ఫలితంగా కొందరు వాహనం రోడ్డు పక్కన ఆపి సేద తీరుతారు. అయితే ఇంకొందరు సుదూర ప్రాంతాల నుంచి వేగంగా వచ్చి టక్కున ఆపలేక ఆగి ఉన్న వాహనాలను ఢీకొడుతున్నారు. పొగమంచుతో ముందు ఉన్న వాహనం కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

వాహనాలు కనిపించక...

రవాణా శాఖ లెక్కల ప్రకారం రోజూ తెల్లవారుజామున నుంచి ఉదయం 8 గంటలల్లోపు ఇరుగు, పొరుగు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా చేసే 2 వేల వాహనాలు జిల్లాలోని జాతీయ రహదారి గుండా వెళ్తుంటాయి. పొగమంచు పెరిగినప్పుడు కొందరు ముందు జాగ్రత్తగా జాతీయ రహదారిలోని పార్కింగ్ ప్రదేశంలో వాహనం నిలుపుతూ ఉంటారు. అవగాహన లేని డ్రైవర్లు కొందరు రోడ్డు పక్కనే వాహనాలు నిలుపుతున్నారు. ఇంకొన్ని చోట్ల పార్కింగ్ సమస్య కారణంగా రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులకు వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనల్లో ప్రాణ నష్టం కూడా తీవ్రంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.




సోమవారం ఉదయం 8 గంటల వేళ పుట్టపర్తి సమీపంలో కమ్మేసిన పొగమంచు

అప్రమత్తత అవసరం

పొగమంచుతో ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించడం లేదు. అందువల్ల ఆ సమయంలో ప్రయాణాలు సరికాదు. రాత్రి వేళ రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపరాదు.
– ఎస్ఎస్ కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి,

మహమ్మారి పొంచి ఉన్నా మొద్దునిద్రే..

- బెంగళూరులో 'హెచ్‌ఎంపీవీ' కలకలం
- ఇద్దరు శిశువులకు వైరస్ నిర్ధారణ
- ముందస్తు చర్యలు తీసుకోవడంలో ఆరోగ్యశాఖాధికారుల విఫలం



అనంతపురం మెడికల్: కోవిడ్ మహమ్మారి వేల మందిని బలి తీసుకుంది. అందుకే కోవిడ్ పేరు వింటే ఇప్పటికీ హడలెత్తి పోతారు. ఇటీవల అదే కోవకు చెందిన మరో వైరస్ కలవరపెడుతోంది. ఉమ్మడి జిల్లాకు సమీపంలోని బెంగళూరులో పంజా విసిరింది. దీంతో దేశమే ఉలిక్కి పడింది. ఇంత జరుగుతున్నా ఉమ్మడి జిల్లా యంత్రాంగం మొద్దు నిద్ర వీడటం లేదు.

వందలాది మంది రాకపోకలు..

చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. మనదేశంలోనూ ఈ మహమ్మారి జాడలు బెంగళూరులో కన్పించాయి. ఇద్దరు శిశువుల్లో హెచ్‌ఎంపీవీ వైరస్ ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉమ్మడి జిల్లా నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి మన జిల్లాకు రోజూ వేలాది మంది ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారు సైతం ఉమ్మడి జిల్లా మీదుగానే బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి తరుణంలో ఉమ్మడి జిల్లాపై వైరస్ ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఈ క్రమంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆరోగ్యశాఖాధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సర్వజనాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, అటువంటి చర్యలేమీ తీసుకోలేదు.

లక్షణాలు ఇలా..

కోవిడ్ 19 ఫ్లూ. శ్వాసకోశ రుగ్మతలను కలిగిస్తుంది. జ్వరం, దగ్గు, ముక్కు కారడం, గొంతు నొప్పి తదితర లక్షణాలుంటాయి. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న వారిలో బ్రాంకైటీస్, నిమోనియాకు దారితీస్తుంది. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిని తీవ్రంగా ఇబ్బంది పెట్టే అవకాశం ఎక్కువ.

అతివదే నిర్ణయాధికారం

- జిల్లా ఓటర్లు 14,12,331 మంది
- పురుషుల కంటే మహిళలు 8,683 మంది ఎక్కువ



ప్రశాంతి నిలయం: నిర్ణయాధికారం అతివ చేతుల్లోకి వెళ్లింది. పాలకులను ఎన్నుకునే ఓటర్లలో మహిళలే ఎక్కువగా ఉండగా..పగ్గాలు ఎవరికి అప్పగించాలన్నది పడతుల విజ్ఞతపై ఆధారపడి ఉంది. సోమవారం జిల్లా ఓటరు తుది జాబితాను కలెక్టర్ టీఎస్ చేతన్ విడుదల చేశారు. ఓటరు జాబితా పరిశీలిస్తే జిల్లాలోని మడకశిర, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 14,12,331 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 7,01,135 మంది, స్త్రీలు 7,09,818 మంది ఉన్నారు, ఇక సర్వీస్ ఓటర్లు 1,314 మంది ఉండగా, ఇందులో 1,281 మంది పురుషులు, 33 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లాలో 64 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారు.

జిల్లా తుది ఓటరు జాబితా వివరాలు ఇలా..

అసెంబ్లీ నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	సర్వీస్ ఓటర్లు	మొత్తం
మడకశిర(ఎస్సీ)	1,06,202	1,05,501	1	2,11,704	75	2,11,779
హిందూపురం	1,25,161	1,25,213	19	2,50,393	84	2,50,477
పెనుకొండ	1,18,162	1,18,345	4	2,36,511	198	2,36,709
పుట్టపర్తి	1,04,472	1,07,211	12	2,11,695	442	2,12,137
ధర్మవరం	1,22,028	1,24,247	20	2,46,295	256	2,46,551
కదిరి	1,25,110	1,29,301	8	2,54,419	259	2,54,678
	7,01,135	7,09,818	64	14,11,017	1,314	14,12,331

కలర్ ఫుల్లు.. ఆరోగ్యానికి చిల్లు



- అనంతపురంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న షిర్డీ సాయి స్వీట్స్ దుకాణంలో మూడు నెలల నెల రోజుల క్రితం ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో ఆహార పదార్థాలను పరిశీలించారు. నెయ్యి, ఐస్‌క్రీమ్ బర్ఫీలు నాసిరకంగా ఉన్నట్లు తేల్చారు. దుకాణ నిర్వాహకులకు జరిమానా విధించారు.
- అనంతపురంలోని బెంగళూరు అయ్యంగార్ బేకరీలో నెల క్రితం అధికారులు తనిఖీలు చేపట్టారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. నమూనాలను సేకరించి ల్యాబుకు పంపారు. వాస్తవమని తేలితే రూ. లక్ష వరకూ పెనాల్టీ విధించే అవకాశం ఉంది.
- నెల క్రితం అనంతపురంలోని ఎస్ఎస్ ప్యాలెస్ హోటల్‌కెళ్లిన ముగ్గురు స్నేహితులు చేపల కర్రీ ఆర్డర్ చేశారు. సిబ్బంది వడ్డించిన కర్రీ నాణ్యతగా లేకపోవడంతో నిర్వాహకులను ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆహార భద్రతా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు నమూనాలు తీసి ల్యాబుకు పంపించారు. ఈ మూడు చోట్లే కాదు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఇదే దుస్థితి.

- ఘుమఘుమల మాటున మోసం
- దడ పుట్టిస్తున్న బేకరీలు, హోటళ్ల నిర్వాహకులు
- ఆహా అనిపిస్తూనే చుక్కలు చూపిస్తున్న వైనం
- వారాల తరబడి ఆహార పదార్థాల నిల్వ
- నాణ్యతలేని పదార్థాలతో వంటకాలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

అనంతపురం జిల్లాలో హోటళ్లు	550 పైనే
లైసెన్సుతో నడుస్తున్న హోటళ్లు	200 లోపు
శ్రీ సత్యసాయి జిల్లాలో హోటళ్లు	300 పైనే
లైసెన్సుతో నడుస్తున్నవి	150కి లోపే
రెండు జిల్లాల్లో బేకరీలు	140 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో హోటళ్లు, బేకరీల నిర్వాహకుల కక్కుర్తికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నాసిరకం నూనెల వాడకం మొదలు మాంసాహారాన్ని వారాల తరబడి నిల్వ ఉంచుతున్నారు. దాన్నే ఆహార ప్రియులకు వడ్డిస్తూ వారి ఆశలపై నీళ్లు జల్లుతున్నారు. రోజూ ఏదో ఒక చోట ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతుండటం భయాందోళనకు గురిచేస్తోంది.

రోజుల తరబడి నిల్వ..

అనంతపురం, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కదిరి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో బేకరీలు, హోటళ్లు ఉన్నాయి. వీటిల్లో అమ్మకాలకు ఉంచుతున్న ఆహారంపై తీవ్ర అనుమానాలు కలుగుతున్నాయి. ముఖ్యంగా వెజ్ పఫ్‌లు, ఎగ్‌పఫ్‌లు రోజుల తరబడి నిల్వ ఉంచి కస్టమర్లకు అప్పటికప్పుడు ఓవెన్‌లో వేడిచేసి ఇస్తున్నారు. వేడి చేయడం వల్ల బూజు కనిపించదు. ఈ క్రమంలో ఆ పదార్థం తిన్న వారు ఫుడ్‌పాయిజన్‌తో ఆస్పత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువకాలం నిల్వ ఉంచిన ఐస్‌క్రీంలు, కేక్‌లు, పాల పదార్థాలు తిని అనారోగ్యానికి గురవుతున్నారు.

కఠిన శిక్షలు లేకే..

ఇటీవల అనంతపురంలోని వివిధ బేకరీలు, హోటళ్లలో అధికారులు తనిఖీల్లో నిర్వహించారు. అనంతపురంలోని స్వగృహ స్వీట్స్ నమూనాలు సేకరించారు. ఇంకా రిపోర్టులు రావాల్సి ఉంది. అలెగ్జాండర్ హోటల్‌లో చికెన్ లాలీపప్‌పై ప్రమాదకర రంగులు వాడినట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. ఇక.. బెంగుళూరు హైవేలోని పాకశాల, తాడిపత్రి బిరియాని హోటళ్లలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు వండుతున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. జరిమానాలు విధిస్తున్నా నిర్వాహకులు దారికి రాకపోవడం గమనార్హం. ఆహార భద్రతా చట్టం పరిధిలో కఠిన శిక్షలు లేకపోవడంతో హోటళ్లు, బేకరీలు, స్వీట్‌షాపుల నిర్వాహకులు బరితెగిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు హోటళ్ల యజమానులు రాజకీయ నాయకులకు ఫోన్ చేసి తమ మీద ఈగ వాలకుండా చేసుకుంటుండటం గమనార్హం.

గడువులోపు అర్జీలన్నీ పరిష్కరించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో అందే అర్జీలన్నీ గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్లు, ఇంటి పట్టాలు, ఇళ్ల మంజూరు, పట్టాదారు పాసు పుస్తకాలు, రస్తా సమస్యలు తదితర వాటిపై మొత్తంగా 215 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం వాటిని ఆయా శాఖలకు పంపారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఇందుకోసం ముందుగానే అర్జీదారుడితో మాట్లాడితే సమస్య గురించి క్షుణ్ణంగా తెలుస్తుందని, అప్పుడు మెరుగైన పరిష్కారం చూపవచ్చన్నారు. కోర్టు కేసులు, ఆర్థిక పరమైన కేసులు మినహా ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఇచ్చిన హామీలకు సంబంధించిన పనులను ఆయా శాఖల అధికారుల వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్డీఓలు కుల సర్వేకు సంబంధించి పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు సమర్పించాలని, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం ద్వారా జిల్లాలో సోమందేపల్లి మండలం నాగేనాయన చెరువు తండా, తనకల్లు మండలం ముండ్లవారి పల్లి తండా, గాండ్లపెంట మండలం తుమ్మల బైలు గ్రామం ఎంపిక య్యాయని తెలిపారు. అన్ని శాఖల విభాగ అధిపతులు వారి శాఖల ఆధ్వర్యంలో 18 అంశాల వారీగా అంచనాలు, అవసరాలు వివరాల నివేదికను అందజేయాలన్నారు. శాఖల వారీగా వ్యక్తిగత లబ్ధి, కమ్యూనిటీ లబ్ధి వివరాల జాబితాను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడీఈ విజయశాంతి బాయి, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఈఓ కృష్ణప్ప, పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, వ్యవశాఖ శాఖ అధికారి సుబ్బారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

కుష్టువ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి..

జిల్లాలో కుష్టు వ్యాధి నివారణకు సంబంధిత అధికారులందరూ సమష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కుష్టువ్యాధి నిర్ధారణ, లక్షణాలపై గ్రామగ్రామానా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటినీ సందర్శించి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఎండీటీ మందులు అందిస్తారన్నారు.

క్లుప్తంగా

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అందజేస్తున్న అర్జీలను నిర్లక్ష్యం చేయరాదంటూ సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, కోర్టు ఉత్తర్వులు, ఎస్సీఎస్టీ కమిషన్ ఆదేశాలు తదితర అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, వీఆర్‌ఓలతో ఆయన సమీక్షించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతిబాయి తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 41 వినతులు



అర్జీదారు సమస్య వింటున్న అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 41 వినతులు అందాయి. అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

పరిగి: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పరిగి ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు. వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. పరిగి మండలంలో ఓ గ్రామానికి చెందిన ఏడేళ్ల వయసున్న చిన్నారిపై ఉప్పర సునీల్‌కుమార్ అనే వ్యక్తి ఆదివారం అత్యాచారయత్నం చేశాడు. ఘటనపై బాధిత కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు సునీల్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అంధుల ఆశాదీపం... సమర్థనం



ఇద్దరు దివ్యాంగుల ఆలోచన నేడు వైకల్యంతో బాధపడుతున్న వేలాది మందికి కల్పతరువుగా మారింది. చిన్నప్పుడు తాము పడిన ఇబ్బందులు ఏ ఒక్క దివ్యాంగుడికీ రాకూడదన్న వారి ఆలోచన సమర్థనం ట్రస్ట్ ఏర్పాటుకు దారి తీసింది. అనూహ్య విజయాలను సొంతం చేసుకుని నేడు దేశ వ్యాప్తంగా విస్తృత సేవలందిస్తోంది. దివ్యాంగులను ట్యాక్స్ పేయర్‌గా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 'సమర్థనం' ట్రస్ట్ ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

దివ్యాంగులకు దన్నుగా నిలుస్తున్న ట్రస్ట్

- నైపుణ్యాభివృద్ధి శిక్షణ. క్రీడా రంగాలకు అధిక ప్రాధాన్యత
- శిక్షణతో పాటు ఉద్యోగావకాశాల కల్పన





సమర్థనంలో శిక్షణ తీసుకుంటున్న దివ్యాంగ విద్యార్థులు, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌తో చైల్డ్ వెల్ఫేర్ డిసేబుల్డ్ జాతీయ అవార్డు తీసుకుంటున్న మహంతేష్ (ఫైల్)

చిలమత్తూరు: వికలాంగుల ప్రపంచాన్ని మార్చాలనే ఆశయంతో దృష్టి లోపంతో బాధపడుతున్న బెంగళూరుకు చెందిన మహంతేష్ తన స్నేహితుడు నగేష్‌తో కలసి 1997లో సమర్థనం ట్రస్ట్‌ను స్థాపించారు. ఈ క్రమంలో దివ్యాంగులు గౌరవంగా జీవిస్తూ పన్ను చెల్లించే వ్యక్తులుగా గౌరవించబడే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ఎన్నో సవాళ్లను అధిగమించారు. విద్య, నైపుణ్యం, క్రీడలు, పర్యావరణం, కళలు, సంస్కృతి, పునరావాసం, ఆరోగ్యం, పోషకాహారంతో సహా విభిన్న కార్యక్రమాలతో ప్రతి స్థాయిలో దివ్యాంగులకు దన్నుగా నిలిచేలా సమర్థనం ట్రస్ట్‌ను తీర్చిదిద్దారు. బెంగళూరులో మొదలైన ప్రస్థానం నేడు గుంటూరు, కొడికొండ చెక్‌పోస్ట్, ఢిల్లీ, ముంబయి, పూణే, చెన్నై, హైదరాబాదుతో పాటు 14 చోట్ల సమర్థనం లైవ్‌లీ హుడ్ రీసోర్స్ సెంటర్లకు విస్తరించింది. సమర్థనం ట్రస్ట్ సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలుమార్లు అవార్డులతో నిర్వాహకులను సత్కరిస్తున్నాయి. 2024లో సంస్థ ఫౌండర్ మహంతేష్‌ను గౌరవ డాక్టరేట్‌తో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సత్కరించింది.

మూడు నెలల పాటు శిక్షణ..

చిలమత్తూరు మండలంకొడికొండ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సమర్థనం ట్రస్ట్ శాఖ ద్వారా ఇప్పటి వరకూ 1,297 మంది దివ్యాంగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించారు. శిక్షణా కాలంలో వసతితో పాటు అన్ని విధాలుగా నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. 2016లో అనంతపురం కేంద్రంగా ట్రస్ట్ కార్యకలాపాలు మొదలు కాగా, కొడికొండ చెక్‌పోస్టు వద్ద ఓ దాత విరాళంగా అందజేసిన మూడు ఎకరాల స్థలంలో శాశ్వత భవనాలు నిర్మించి 2022 నుంచి కార్యక్రమాలను విస్తృతం చేశారు. అంతేకాక ట్రస్ట్ ద్వారా ఏటా 100 మంది దివ్యాంగ విద్యార్థులకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఉపకార వేతనాలు అందిస్తున్నారు. అలాగే కళలు, క్రీడల్లో ఆసక్తి ఉన్న వారికి సమర్థనం ట్రస్ట్ మంచి అవకాశాలు కల్పిస్తోంది. దీని కోసం సునద పేరుతో ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. సంస్థ ఫౌండర్ మహంతేష్ అంతర్జాతీయ క్రికెట్‌లో దివ్యాంగుల భారత జట్టు తరఫున ఆడారు. ప్రస్తుతం ఆయన క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియాకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

ట్యాక్స్ పేయర్స్‌గా మార్చాలన్నదే నా కల



నా చిన్నప్పుడు చదువుకునేందుకు ఆర్థిక పరిస్థితులు బాగా ఇబ్బంది పెట్టాయి. దీనికి తోడు దివ్యాంగుడిని కావడంతో సమాజంలో పరిస్థితులు ప్రతికూలంగా ఉండేవి. దీంతో నాలాంటి దివ్యాంగుల కోసం ఏదో ఒకటి చేయాలని అప్పుడే అనుకున్నా. సమర్థనం ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం 14 కేంద్రాల్లో వేలాది మందికి దారి చూపెడుతున్నాం. వారిని ట్యాక్స్ పేయర్స్‌గా మార్చాలన్నదే నా సంకల్పం. 800 మందికి పైగా ఉద్యోగులు మా సంస్థలో పనిచేస్తున్నారు. – డా. మహంతేష్, ఫౌండర్, సమర్థనం ట్రస్ట్

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ఓడీచెరువు: కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న 44 మద్యం బాక్సులు, 4,264 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఓడీచెరువు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. అందిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం ఉదయం మహమ్మదాబాద్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన రెండు వాహనాలను అడ్డుకుని పరిశీలించగా... 25 బాక్సుల్లో 90ఎంఎల్ సామర్థ్యమున్న 2,400 వాట్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల మద్యం, 17 బాక్సుల్లో 90 ఎంఎల్ సామర్థమున్న 1,632 సిల్వర్ కప్ టెట్రా ప్యాకెట్లు, రెండు బాక్సుల్లో 192 విస్కీ ప్యాకెట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఓ సుమోతో పాటు కారును సీజ్ చేశారు. మద్యం తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

'అనంత'లో వృద్ధురాలి హత్య



సావిత్రి మృతదేహం

అనంతపురం: జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ఓ వృద్ధురాలు దారుణ హత్యకు గురైంది. గొంతు కోయడంతో రక్తమడుగులోనే కొట్టుమిట్టాడుతూ తుదిశ్వాస విడిచింది. అనంతపురం నాల్గో పట్టణ పీఎస్ సీఐ కె.సాయినాథ్ తెలిపిన మేరకు... రుద్రంపేట పంచాయతీ టీచర్స్ కాలనీలో నివాసముంటున్న సావిత్రి (63), ఓబులేసు దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అటవీశాఖలో సూపరింటెండెంట్‌గా ఉద్యోగ విరమణ చేసిన కొంత కాలానికే ఓబులేసు మృతి చెందారు. అప్పటి నుంచి టీచర్స్ కాలనీలోని సొంతింట్లో సావిత్రి ఒంటరిగానే జీవిస్తోంది. పెద్ద కుమారుడు, కుమార్తె ఉద్యోగరీత్యా యూఎస్ఏలో స్థిరపడ్డారు. చిన్న కుమారుడు విజయ్‌కుమార్ నగరంలోని కోవూరు నగర్‌లో నివాసముంటూ రోజూ ఇంటి వద్ద నుంచి తల్లికి భోజనం తీసుకెళ్లి ఇచ్చి వస్తుండేవాడు. తల్లి బాగోగులు చూసుకునేందుకు ఇంటి వద్ద ఓ మనిషిని ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో సావిత్రి ఇంటి వద్దకు పని మనిషి రమణమ్మ వెళ్లింది. ఇంటి ప్రధాన ద్వారం తీసి ఉండడంతో అనుమానం వచ్చిన ఆమె లోపలికి వెళ్లి చూడగా, వంటగదిలో గొంతుకు గాయమై రక్తమడుగులో కొట్టుమిట్టాడుతూ మృతి చెందిన సావిత్రి కనిపించింది. విషయాన్ని వెంటనే ఆ ఇంటి పైపోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వారికి తెలపడంతో వారి ద్వారా సమాచారం అందుకున్న కుమారుడు విజయ్‌కుమార్, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. నేరం జరిగిన ప్రాంతంలో నిందితుల జాడను గుర్తించేందుకు డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సీఐలు కె.సాయినాథ్, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, శాంతిలాల్ జల్లెడ పట్టారు. క్లూస్‌టీం, స్నిఫ్ఫర్ డాగ్ స్క్వాడ్‌ను రంగంలో దించారు. నిందితుల వేలి ముద్ర నమూనాలను స్వీకరించారు. వృద్ధురాలి మెడలో బంగారు చైను, సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో వాటి కోసం దారుణానికి ఒడిగట్టి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. హతురాలి ఫోన్ స్విచాఫ్ అయి ఉంది. కాల్‌డేటాను సేకరించారు. పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. రక్త మరకలు వంట గది నుంచి ప్రధాన ద్వారం వరకు పడి ఉన్నాయి. దీనిని బట్టి ప్రధాన ద్వారం వద్దనే ఆమె గొంతు కోసి ఉంటారనే అనుమానాలూ వ్యక్తమయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కేఎస్ఎన్ డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యలత

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో మూడో సెమిస్టర్ ఫలితాలను సోమవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత విడుదల చేశారు. మొత్తం 438 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 390 మంది (89.04 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బీఏ (ఆనర్స్)లో 85 మందికి గాను 78 మంది, బీకామ్ (ఆనర్స్)లో 124 మందికి గాను 118 మంది, బీఎస్సీ (ఆనర్స్)లో 229 మందికి గాను 194 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను బుధవారం కళాశాల వెబ్‌సైట్‌లో అందబాటులో ఉంచనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రీవాల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక్కో పేపర్‌కు రూ. 300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కళాశాల టాపర్లు వీరే..

బోయ సృజన (కెమిస్ట్రీ) 9.15 గ్రేడ్ పాయింట్లతో కళాశాల టాపర్‌గా నిలిచింది. అలాగే కవితాకర్ సుష్మ (మ్యాథమెటిక్స్) 9.08 పాయింట్లు, సంపంగి చందన (మ్యాథమెటిక్స్) 9.06 పాయింట్లు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ హెచ్. శివశంకర్, అధ్యాపకులు రామాంజనేయులు, రామలింగారెడ్డి, షఫీ, రామకృష్ణ, అంజనరెడ్డి, రేణుక, తిమ్మారెడ్డి, ఆదినారాయణ, రమణనాయుడు అభినందించారు.

కూటమి నేతల దౌర్జన్యం



పట్టా భూముల్లోని ఇసుకను దౌర్జన్యంగా తరలిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: అధికారం అండ చూసుకుని కూటమి నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యంగా తమ పట్టా భూముల నుంచి ఇసుకను తరలిస్తున్నారని ధర్మవరం మండలం పోతులనాగేపల్లికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులు కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, హనుమంతరెడ్డి, పెద్దిరెడ్డి తదితరులు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 326–8లో ఇసుక భూములు ఉన్నాయన్నారు. ఈ భూముల్లో దౌర్జన్యంగా యంత్రాలను ఏర్పాటు చేసి కూటమి నాయకులు నరేష్, శీన, నరసింహులు, రామాంజనేయులు, రమేష్, ప్రభాకర్, ధనశేఖర్ రేయింబవళ్లూ ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్నారు. అడ్డుకోబోయిన తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయమై ఇప్పటికే ఆర్డీఓ, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ తరలింపులు అడ్డుకుని తమ భూములను పరిరక్షించాలని కోరారు.

టీడీపీ నేత బారి నుంచి కాపాడండి

- తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ముస్లింలు



విలేకరులతో మాట్లాడుతున్న ముస్లింలు

రొద్దం: టీడీపీ నేత బారి నుంచి తమను కాపాడాలంటూ తహసీల్దార్ నాగేంద్రకు పలువురు ముస్లింలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో దివ్యాంగుడు షరీఫ్, తదితరులు మాట్లాడుతూ.. తాము డబ్బా రేకులతో తయారు చేసిన గృహోపకరణాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. తమ అన్నదమ్ములైన లేట్ చిన్న మహమ్మద్ సాహెబ్, పెద్ద మహమ్మద్ సాహెబ్‌కు 1995లో అప్పటి ప్రభుత్వం రొద్దం పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 166–13, 4 ఎకరాలు, సర్వేనంబర్ 166–14లో ఉన్న 4.10 ఎకరాల వ్యవసాయ భూమికి పట్టాలు ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆ భూములను తమ సాగు అనుభవంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత స్థానిక టీడీపీ నేత డీలర్ చాకిల ఉమాశంకర్... ఆ భూమిని కబ్జా చేసి ఆయన భార్య పేరున పట్టా చేసుకున్నాడన్నారు. విషయం తెలుసుకున్న తాము వెళ్లి నిలదీస్తే బెదిరింపులకు దిగాడన్నారు. తాను విలేకరినని... తాను ఏమి చెబితే అధికారులు అది చేసి తీరాల్సిందేనని, దిక్కున్న చోటుకెళ్లి ఫిర్యాదు చేసుకోవాలంటూ దౌర్జన్యం చేశాడన్నారు. అంతేకాక ఎస్‌ఐ నరేంద్ర సమక్షంలోనే ఆ భూమి జోలికొస్తే అంతు చూస్తానని బెదిరించాడన్నారు. ఎస్‌ఐ నరేంద్ర సైతం తమ పత్రాలను పరిశీలించకుండా, రెవెన్యూ అధికారులను సంప్రదించకుండా కబ్జాదారుడైన చాకిల ఉమాశంకర్‌కే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భూమిని వదలక పోతే కేసులు నమోదు చేస్తానంటూ ఎస్‌ఐ సైతం బెదిరిస్తున్నాడని వాపోయారు. వీరి దౌర్జన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నామన్నారు.

రెండు గ్రామాలు.. ఓ దేవర దున్న

- మాదంటే మాదంటూ గొడవ
- ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన
- ఎవరికీ హక్కు లేదన్న పోలీసులు
- స్వేచ్ఛగా వదిలేయడానికి ఇరు గ్రామాల అంగీకారం



జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ముద్దలాపురం గ్రామస్తులు

కూడేరు/అనంతపురం: ఓ దేవర దున్నపోతు పంచాయితీ రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. ఆ దున్న తమదేనంటూ కూడేరు మండలం ముద్దలాపురం, కడదరకుంట గ్రామాల ప్రజలు పట్టుదలకు పోయారు. ఇది కాస్తా వివాదంగా మారి కొన్ని రోజులుగా కొనసాగుతూ వచ్చింది. చివరకు పోలీసుల జోక్యంతో సోమవారం ఈ వివాదానికి తెర పడింది. వివరాల్లోకి వెళితే...కడదరకుంట గ్రామంలో ఈ నెల 20, 21 తేదీల్లో బొడ్రాయి ప్రతిష్ట సందర్భంగా ఊరి దేవర ఉంది. అలాగే ముద్దలాపురంలో 21, 22 తేదీల్లో ముత్యాలమ్మ దేవత ప్రతిష్ట సందర్భంగా ఊరి దేవర నిర్వహించనున్నారు. ఇటీవల దున్నపోతు కడదరకుంట గ్రామంలోకి వెళ్లడంతో ఊరి దేవర సందర్భంగా బలి ఇచ్చేందుకు గ్రామస్తులు కట్టేసుకున్నారు. విషయం తెలుసుకున్న ముద్దలాపురం గ్రామస్తులు కడదరకుంటకు వెళ్లి దున్నపోతు తమదని, వదలాలని కోరారు. ఈ సందర్భంగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత కూడేరు పోలీసు స్టేషన్‌లో ముద్దలాపురం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇరు గ్రామాల ప్రజలను సీఐ రాజు పిలిపించి విచారించారు. దున్నపోతు వయసు ఎంత ఉంటుందని ఆరా తీశారు. ఒక్కో గ్రామస్తులు ఒక్కోలా వయసు చెప్పారు. పశు వైద్యాధికారులతో పరీక్షింపజేసి వయసు కరెక్ట్‌గా చెప్పిన గ్రామానికి దున్నపోతును పంపిస్తామని పోలీసులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన

దున్నపోతు ముమ్మాటికీ తమదేనంటూ ముద్దలాపురం వాసులు సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజా వేదికలో ఫిర్యాదు చేసేందుకు మహిళలతో సహా వంద మందికి పైగా ఐదు ట్రాక్టర్లలో అనంతపురం చేరుకున్నారు. కలెక్టరేట్లో ప్రజావేదిక లేదని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి ఎస్పీ కార్యాలయానికి చేరుకుని..తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. అక్కడే పోలీసు స్పందనలో ఉన్న కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు వారి సమస్యను విని పరిష్కారం చూపాలని కూడేరు సీఐ రాజును ఆదేశించారు. దీంతో సీఐ ఇరు గ్రామాల ప్రజలను పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని మాట్లాడారు. ఇరు గ్రామాలకూ దున్నపోతుపై హక్కు లేదని, రెండు గ్రామాల్లో దేవర ముగిసే వరకు పోలీసుల సంరక్షణలో ఉంటుందని, తర్వాత స్వేచ్ఛగా వదిలేద్దామని చెప్పారు. ఇందుకు ఇరు గ్రామాల ప్రజలు అంగీకరించారు. దీంతో వివాదానికి తెరపడింది.

విశ్వాసమే ఇస్లాంకు గీటురాయి

- 'పురం'లో ప్రారంభమైన ఇస్తెమా



ఇస్తెమాలో ప్రసంగిస్తున్న మతపెద్దలు

హిందూపురం: విశ్వాసమే ఇస్లాంకు గీటురాయి అని, ఇస్లాం పాటించే వారంతా విశ్వాసంతో అల్లాహ్‌ను ప్రార్థించాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. పట్టణంలోని పరిగి రహదారి వద్ద సోమవారం మధ్యాహ్నం ఇస్తేమా ప్రారంభమైంది. ఢిల్లీ నుంచి విచ్చేసిన మత పెద్దలు భయాన్ (ప్రసంగాలు) చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రసంగాలు, సందేశాలు అందించారు. ప్రతి ఒక్కరూ అల్లాహ్ పట్ల విశ్వాసం, నమ్మకంతో నమాజ్ చేయాలన్నారు. ముఖ్యంగా దానగుణాలను కలిగి ఉండాలని, పొరుగువారికి సహాయ పడాలన్నారు. ఇస్తెమాకు హిందూపురం నుంచే కాకుండా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు, కర్ణాటక రాష్ట్ర నుంచి కూడా పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చారు. మంగళవారం ముఖ్య మత పెద్దలు కార్యక్రమానికి హాజరై అల్లాహ్ సందేశం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఇస్తెమాకు హాజరైన ముస్లింలు

కారు అపహరణ కేసులో నిందితుడి అరెస్ట్

గోరంట్ల: మండలంలోని కుబేర హిల్స్‌లో గత ఏడాది ఆగస్టు లో కారు అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఘటనపై అప్పట్లో కుబేర హిల్స్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితుడు, రామన్నపల్లికి చెందిన వినోద్‌కుమార్‌ను సోమవారం బూదిలి క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న సుమారు 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం అనంతపురం నుంచి బెంగుళూరు వైపు వాహనంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో డ్రైవర్ షాకీర్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.